

పాములేరులో ఇద్దరు గల్లంతు!

విషాదం మిగిల్చిన విహారయాత్ర

7

నీట్.. కొట్టారు!

నీట్ 2025 ఫలితాలు విడుదలయ్యాయి.. ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.. తిరుమల విద్యార్థి దర్భా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా 19వ ర్యాంక్, స్టేట్ 1వ ర్యాంక్ సాధించాడు. చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు.. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఇలా పలువురు విద్యార్థులు మెరిశారు. నీట్‌ను సాధించారు. ఎంబీబీఎస్ చదవాలనే తమ కలను నిజం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశకు ఊపిరి లూదారు. పలువురు ఐఐటీలో సీటు సాధించారు.

అమ్మానాన్న కష్టం చూసి చదివా..



నా పేరు కొడవటి మోహిత్ శ్రీరామ్.. మాది చాగల్లు..నాన్న సత్యనారాయణ, తల్లి నవీన.. మాది వ్యవసాయ కుటుంబం.. నన్ను ఉన్నత స్థానంలో చూడాలనే కష్టపడి చదివించారు. వారి కష్టానికి విలువ ఇవ్వాలని కదా.. ఆ కష్టమే నన్ను బాగా చదివేలా చేసింది. శనివారం విడుద లైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించా. గతంలో ప్రకటించిన ఏపీఈఏపీ సెట్‌లో 9వ ర్యాంకు సాధించా. డాక్టర్ కావాలనే నా కల నిజం చేసుకుంటున్నా.

- కొడవటి మోహిత్ శ్రీరామ్, చాగల్లు

ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ కనిపించే దైవమైతే.. నాన్న కనిపించే ధైర్యం.. జీవితంలో తప్పటడుగు వేయకుండా.. తడబడకుండా కాచుకొంటూ.. వేలు పట్టి అడుగులు నేర్పించి.. నేనున్నాను రా! అనే భరోసా నాన్న. అమ్మ ప్రేమకు ప్రతి రూపమైతే.. నాన్న ప్రతి క్షణం నడిపించే బాధ్యత. ఓడినప్పుడు భుజం తట్టి.. గెలిచినప్పుడు పది మందికి చెప్పుకొని మురిసిపోయే వాడు నాన్న. బయటకు కఠినం.. లోపల మాత్రం బిడ్డల గురించి భయపడేవాడే నాన్న. పిల్లలు కష్టపడకూడదని తన ఇష్టాలను కూడా చిరునవ్వుతో మరిచిపోయేవాడు నాన్న. అడుగులు నేర్పిన చిటికిన వేలు నాన్నదే.. బుడిబుడి పాదాలతో తన్నుతూ ఆడుకున్న గుండెలు నాన్నవే.. చాలామంది జీవిత కథల్లో సూపర్ హీరో నాన్నే. నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న 'పితృదేవోభవ'..



నాన్నకు ప్రేమతో..

నేడు ఫాదర్స్ డే

ప్రత్యేక కథనం

7లో



పట్టు పట్టారు!

ఉప్పాడ చేనేతకు చేయూత

- ఇన్నేళ్లకు మంచి రోజులు
- 15 చోట్ల చేనేత క్లస్టర్లు
- రూ.15 కోట్లతో ప్రతిపాదనలు
- త్వరలో నిధుల విడుదల
- ప్రాజెక్టుపై పవన్ సంప్రదింపులు
- చేనేతన్నలకు ఆధునిక శిక్షణ
- మారనున్న పిఠాపురం చిత్రం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉప్పాడ అంటే చేనేత..రంగురంగుల చీరలు.. మోడళ్లు.. వీటిపై మనసుపారేసుకోని మహిళలంటూ ఉండరు.. ఎక్కడో హైదరాబాద్, విశాఖ నుంచి ఎందరో ప్రముఖులు ఇక్కడకు వచ్చి చీరలు కొనుగోలు చేస్తారు. సినీ సెలబ్రిటీలు సైతం తమ ఇళ్లల్లో వివాహాలు, ఇతర శుభ కార్యాలకు ఇక్కడి నుంచే చీరలు తీసుకెళతారు. ఏటా రూ.30 కోట్ల వరకు జరిగే ఈ వ్యాపారానికి ప్రోత్సాహం అందిస్తే చేనేత వ్యాపారం ఎదిగే అవకాశం ఉంది. అటు చేనేత కార్మికులకు సైతం మేలు జరగనుంది. ఈ నేపథ్యంలో ఉప్పాడ చేనేతకు మరింత చేయూత నందించి ఆధునిక డిజైన్లలో చీరలు తయారు చేసేలా ప్రభుత్వం తోడ్పాటు అందించబోతోంది. ఈ మేరకు రూ.15 కోట్లతో చేనేత అభివృద్ధి క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. తన సొంత నియోజకవర్గం కావడంతో పవన్ సైతం కేంద్రంతో మాట్లా డుతున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు చేనేత శాఖ అధికారులు చెబుతున్నారు.

1600 కుటుంబాలకు ఆధారం

ఉప్పాడ అంటే చేనేత చీరలకు ప్రసిద్ధి. చెన్నై నుంచి మేలురకం నూలు తీసుకు వచ్చి ఇక్కడ మగ్గాలపై నేత కార్మికులు రక రకాల చీరలు నేస్తారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరుంది. ఉప్పాడ, పిఠాపురం, గొల్లప్రోలులో దాదాపు 1600 చేనేత కుటుంబాలు ఉండగా వీరిలో అనేక మంది పట్టు, జాంధానీ చీరలను మగ్గాలపై నేస్తారు. ఉప్పాడలో రెండు చేనేత సంఘాలు వీటిని తయా రుచేసి విక్రయిస్తాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేనేత ప్రోత్సాహానికి పథకం ప్రారంభించింది. నీడ్ బేస్డ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఉప్పాడ చేనేత క్లస్టర్ ప్రాజెక్టును ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అటు పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ అయినందున ఇక్కడ చేనేతను మరింత ప్రోత్సహించాలని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక ఆసక్తి కనబర్చి కేంద్రానికి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు.ఈ మేరకు ఉప్పాడలో 916 మంది ఇళ్లకు నేరుగా వెళ్లి ఇటీవల చేనేతశాఖ అధికారులు అభిప్రాయాలు సేకరించారు. మొత్తం రూ.15 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం వాటాగా రూ.11.85 కోట్లు ఇవ్వనుంది. మిగిలిన రూ.3.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇటీవల రాష్ట్ర చేనేత కమిషనర్ రేఖారాణి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర చేనేత శాఖకు పంపించారు. ఈ ప్రాజెక్టుపై పవన్ సైతం కేంద్రంతో మాట్లాడుతున్నారు. త్వరలో నిధులు విడుదల కానున్నాయని కాకినాడ కలెక్టర్ వివరించారు.

ఇలా చేస్తారు..

ప్రాజెక్టు అభివృద్ధి కింద పిఠాపురం నియోజకవర్గంలో 15 చోట్ల చేనేతను ప్రోత్సహించడానికి పలు అంశాలు ప్రతిపాదించారు. ఉప్పాడలో రూ.1.40 కోట్లతో పనులు చేయబోతున్నారు. రూ.80 లక్షలతో క్వాలిటీ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. రూ.60 లక్షలతో మెగా షోరూం ఏర్పాటు చేసి చీరలు విక్రయిస్తారు. యు.కొత్తపల్లిలో రూ.కోటితో డిజైన్ స్టూడియో నిర్మిస్తారు. రూ.80 లక్షలతో చీరలు, జాకెట్లు, ఇతర వస్త్రాలు కుట్టేలా యూనిట్ నిర్మించనున్నారు.తాటిపర్తిలో రూ.55 లక్షలతో శారీ స్క్రీన్ పెయింటింగ్ సెంటర్ నిర్మించనున్నారు. రూ.50 లక్షలతో షోరూం నిర్మిస్తారు. రూ.60 లక్షలతో షాప్ అండ్ షాప్ కింద పాడుబడ్డ చేనేత సంఘం భవనాలు ఆధునికీకరిస్తారు. చేబ్రోలులో నూలుకు రంగులు అద్దే యూనిట్ రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. రూ.50 లక్షలతో షోరూం కట్టనున్నారు. దుర్గాడలో రూ.80 లక్షలతో గార్మెంట్ మేకింగ్ యూనిట్ స్థాపించాలని ప్రతిపాదించారు. చెందుర్తిలో రూ.55 లక్షలతో శారీ స్క్రీన్ ప్రింటింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. గొల్లప్రోలులో రూ.50 లక్షలతో హోం ఫర్నీషింగ్ యూనిట్ స్థాపించనున్నారు. మొత్తం రూ.12 కోట్లతో చేనేతకు సంబంధించి ఆధునిక మోడళ్లలో చీరలు, జాకెట్లు డిజైన్ చేయడం, రక రకాల స్క్రీన్ ప్రింటింగ్‌లు అందుబాటులోకి తేనున్నారు. రూ.1.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి జిల్లాలో చేనేత కార్మికులు, మహిళలకు ఆధునిక మోడళ్లపై శిక్షణ ఇస్తారు. దేశంలో ప్రముఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ)ల నుంచి ప్రముఖ డిజైనర్లను ఉప్పాడ తీసుకు వస్తారు. నిపుణులతో రెండేళ్లపాటు శిక్షణ ఇప్పించనున్నారు. ఇందుకు రూ.3 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.



బై..బై.. వైసీపీ!

కూటమి వైపు.. ఫ్యాన్స్ చూపు

- పార్టీ మారేందుకు నేతలు సిద్ధం
- క్యూ కడుతున్న వైసీపీ నాయకులు
- అయినా అంగీకరించని టీడీపీ
- ఆమోదం తరువాతే చేరికలు
- సీఎం చంద్రబాబు వర్తమానం
- డిసెంబరులోనే స్థానిక ఎన్నికలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష వైసీపీ రెక్కలూడిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కొక్కరుగా పార్టీ మారిపోతున్నారు. అవకాశమిస్తే క్యూకట్టేలా ఉన్నారు. వైసీపీ తన వైఖరి వల్లే ప్రజల్లో మరింత వ్యతిరేకత తెచ్చుకుంటోంది. ఇటీవల అమరావతిపై సొంత ఛానల్‌లో అక్కసు వెళ్లగక్కడమే అందుకు ఉదాహరణ. అమరావతి రాజధానిపై సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ చేసి వ్యాఖ్య తీవ్ర పరిణామాలకు దారి తీసిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు చేసిన పనులు, కొందరు కార్యకర్తలు, అధినేత జగన్ వ్యవహార శైలి ఆ పార్టీకి తీవ్ర నష్టం తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ తుడుచుపెట్టుకుపోయింది. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీ ఊసే వినిపించలేదు. దీంతో నేతలతోపాటు, కార్యకర్తలు దిగాలు పడుతున్నారు. దీనికితోడు స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, జడ్పీల్లోనూ ఉన్న వైసీపీ ప్రతినిధులు నెమ్మదిగా జారుకుం టున్నారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పలువురు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు కూటమిలో చేరారు. పిఠాపురంలో వైసీపీ నేత జనసేనలో చేరిపోయారు. తుని మునిసి పాలిటీ టీడీపీ వశమైంది. కొవ్వూరు మునిసిపల్ చైర్మన్ వైసీపీకి రాజీనామా చేశారు. టీడీపీలో చేరనున్నారు. నిడదవోలు మునిసిపాలిటీ జనసేనకు దక్కింది. ఇంకా అనేక మంది పార్టీ మారాలని చూస్తున్నా ఇటు ఆమోదం లభించడంలేదు.

రానున్నాయి.. స్థానిక ఎన్నికలు!

మునిసిపల్ పాలకవర్గాలకు 2021 మార్చి 10న ఎన్నికలు జరిగాయి. 18వ తేదీన చాలా ప్రమాణ స్వీకారాలు జరిగాయి. ఈ ఏడాది మార్చి 18తో పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండిపోయాయి. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల లో వైసీపీ అప్రజాస్వామికం, దౌర్జన్యంగా వ్యవహరించడంతో అన్ని మునిసిపాలిటీల్లోనూ వైసీపీ గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో అధికారం వైసీపీ వశమైంది. మొత్తం 12 మునిసిపాలిటీల్లో అప్పట్లో టీడీపీకి 50 మంది కౌన్సిలర్లు, జనసేనకు 18 మంది, బీజేపీకి 8, కాంగ్రెస్‌కు ఒకటి, వైసీపీకి 319 వచ్చాయి. వీరిలో ఇప్పటికే చాలా మంది పార్టీ మారారు. గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి 9 నుంచి 21వ తేదీ వరకూ ఎన్నికలు 4 దశల్లో జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీకి 805, టీడీపీ, మిత్రపక్షాలకు 143 సర్పంచ్ పదవులు లభించాయి. 805 మందిలో ఇప్పటికే చాలామంది కూటమిలో చేరారు. జడ్పీ ఎన్నికలకు 2021 ఏప్రిల్ ఒకటో తేదీనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు కేవలం 8వ తేదీనే పోలింగ్ జరిగేటట్టు ప్రకటించడం వివాదాస్పదమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీసం నాలుగు వారాలు గడువుతో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలి. కేవలం ఒకటో తేదీనే నోటిఫికేషన్ ఇచ్చి 8న పోలింగ్ తేదీ అని చెప్పడంతో ఇబ్బంది అయింది. అయినా వైసీపీ మొండిగా ఎన్నికలు నిర్వహించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో 2021 సెప్టెంబరు 19న ఫలితాలు ప్రకటించారు. కానీ టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ జడ్పీసీలంతా స్తబ్దుగా ఉన్నారు. జిల్లాలు విడిపోయినా.. జడ్పీ విభజన జరగలేదు. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు కూటమిలో చేరగా, కొందరు జడ్పీటీసీలు సైలెంట్ అయ్యారు. ప్రస్తుతం కూటమి నేతలతో టచ్‌లో ఉన్నారు. పార్టీ మారేందుకు సిద్ధమంటున్నారు.

వస్తామన్నా.. వద్దు : చంద్రబాబు

ఇటీవల టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు ఒక వర్తమానం పంపారు. వైసీపీ నుంచి వచ్చే వారిని ఇష్టానుసారం పార్టీలో చేర్చుకోవద్దని.. ముందు తమకు సమాచారం ఇచ్చి.. ఆమోదం పొందిన తర్వాతే చేర్చుకోవాలని చెప్పడం గమనార్హం. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కూడా ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో చాలామంది వైసీపీ నేతలు కూటమిలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నా రెడ్ సిగ్నల్ ఉంది. పైగా ఎమ్మెల్యేలకు ఆయా మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల్లో అక్రమాలకు పాల్పడి ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకున్నవారిని చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదు. కొందరు వస్తామన్నా వద్దని చెబుతున్నారు. ఇతరులను లాక్కోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. వచ్చే ఏడాది వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ఉంది. కానీ నాలుగేళ్లు పూర్తవడంతో మునిసిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, జడ్పీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెడుతున్నారు. ఎందుకంటే వచ్చే ఫిబ్రవరికి సర్పంచ్‌లకు ఐదేళ్లు నిండిపోతాయి. వచ్చే మార్చి నాటికి మునిసిపల్ పాలకవర్గాల గడువూ ముగిసిపోతోంది. 2026 సెప్టెంబరు నాటికి జడ్పీటీసీలకు ఐదేళ్లు పూర్తవుతాయి. ఇంతలో కంగారు ఎందుకనేలా కూటమి నేతలు ఉన్నారు. ఎక్కువమంది టీడీపీ, జనసేన వైపే మొగ్గు చూపుతున్నారు. కానీ గ్రీన్ సిగ్నల్ అందడం లేదు. ఈ ఏడాది డిసెంబర్ నుంచే స్థానిక ఎన్నికల సందడి మొదలు కావచ్చు.





అమలాపురం బాలయోగి స్టేడియంలో యోగాంధ్రలో భాగంగా కలెక్టర్ మహేష్‌కుమార్ తోపాటు సాధకుల యోగాసనాలు

భారతీయ వారసత్వ సంపద యోగా

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో ప్రపంచమంతా అనుసరిస్తున్న భారతీయ వారసత్వ సంపద యోగా కావడం ఎంతో గర్వకారణమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శారీరక, మానసిక శ్రేయస్సును పెంపొందించుకోవడానికి అంత్యంత విశ్వసనీయ మార్గాల్లో యోగా ఒకటిగా ఉద్భవించిందన్నారు. శనివారం ఉదయం ఉద్యోగులు, సిబ్బందితో అమలాపురం బాలయోగి స్టేడియంలో మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో యోగాంధ్ర ట్రయల్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ట్రైనీలు అందరితో యోగసనాలు వేయించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు యోగా దోహదపడుతుందన్నారు. యోగా సాధనలకు రూపాయి ఖర్చు కూడా అవసరం లేదని చిన్నపాటి స్థలంలో సాధన చేస్తూ ప్రయోజనం పొందవచ్చన్నారు. శారీరక రుగ్మతల నుంచి రక్షణ పొందేందుకు యోగాసనాలు ఆచరించాలన్నారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని యోగా సాధనల ద్వారా అధిగమించవచ్చన్నారు. శారీరక శ్రమతో సతమతమయ్యేవారికి యోగసనాలు దివ్య ఔషధంగా పనిచేస్తాయన్నారు. ప్రతీ ఒక్కరినీ యోగా భాగస్వాములు చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఉద్యోగులతో కలెక్టర్ యోగాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎస్ రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, పశుసంవర్థకశాఖ అధికారి వెంకట్రావు, ఆయుష్ వైద్యాధికారిణి కె.విజయకుమారి, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.



ముంచేస్తోంది!

కేశనపల్లిలో ముంపునీటితో చనిపోయిన కొబ్బరి చెట్లు.. రోడ్డుపైకి వచ్చిన ముంపు నీరు

- శంకరగుప్తం డ్రెయిన్ ముంపుతో అన్ని విధాలా నష్టం
- ఎండిపోతున్న కొబ్బరి తోటలు.. చౌడు బారుతున్న భూములు
- బలవంతపు మరణాలకు అవకాశమివ్వకండి
- తీరప్రాంత గ్రామ రైతులను ఆదుకోండంటూ వేడుకోలు





ఎమ్మెల్యే వరప్రసాద్‌కు శనివారం వినతిప్రతం అందిస్తున్నరైతులు

మలికిపురం,జూన్14(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం తీర ప్రాంతంలో శంకరగుప్తం డ్రెయిన్ ప్రభావంతో కేశనపల్లి, తూర్పుపాలెం, కరవాక, పడమటిపాలెం, శంకరగుప్తం, చింతలమోరి తదితర గ్రామాలకు చెందిన రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. శంకరగుప్తం డ్రెయిన్‌లోకి వైనతేయ నది నుంచి ఉప్పునీరు తరచూ ప్రవహించడంతో తీర ప్రాంత గ్రామాల్లోని డ్రెయిన్‌కు ఇరువైపులా లక్షన్నర కొబ్బరిచెట్లు చనిపోయాయని, భూములు చౌడు బారాయని, రైతుకు దమ్మిడీ ఆదాయం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఎమ్మెల్యేకు ఏకరువుపెట్టారు. శంకరగుప్తం డ్రెయిన్ కొంతమేర డ్రెడ్జింగ్ చేయగా, 8 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ మిగిలిపోయింది. ఆటుపోట్లు సరిలేక ఉప్పునీరు తోటల్లోకి ప్రవేశించి తీరప్రాంత రైతుకు జీవనాధారమైన కొబ్బరి చెట్లన్నీ చనిపోయాయి. కొడుకుకంటే పది కొబ్బరి చెట్లు ఉంటే జీవనం సాగించవచ్చనే సామెతను శంకరగుప్తంలోని ఉప్పునీరు మార్చివేసిందని ఎమ్మెల్యేకు విన్నవిస్తూ ఆవేదన వ్యక్తంచేశారు. డ్రెయిన్‌కు ఇరువైపులా నాలుగన్నర కిలోమీటర్ల మేర ఏటిగట్లు వేస్తే తమకు భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. ఎన్నోమార్లు అధికారులు వస్తున్నారు... వెళుతున్నారు తప్ప ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ కేశనపల్లి తీరప్రాంత రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతో, సంబంధిత శాఖలతో మాట్లాడి పరిష్కారం చూపుతానని హామీఇచ్చారు. డ్రెయిన్ 8 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ చేయాల్సి ఉందని, దీనికి ప్రభుత్వం అనుమతిచ్చిందని, ఆర్థికశాఖ నుంచి అనుమతి లభించిన వెంటనే ఆ పనులు పూర్తి అవతాయన్నారు. రెండు వైపులా ఏటిగట్ల గురించి రైతుల సమస్య గురించి డ్రైనేజీ ఈఈ కిశోర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్‌ను ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించమని ఆదేశించారు. ఉప్పునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకున్నామని, రైతులు ఎటువంటి కలవరపాటు పడవద్దన్నారు. కార్యక్రమంలో మలికిపురం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల నాగు, మాజీ సొసైటీ అధ్యక్షుడు యెనుముల నారాయణస్వామి, ఆకుల చినవెంకన్నాయుడు, రాపాక సత్యనారాయణ, దొంగ వీరవెంకటసత్యనారాయణ, అడబాల నానిలతోపాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుచ్చిబాబుకు బాలబాలాజీ చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఏసీ

వీరేశ్వరస్వామి ఆలయ ఏసీగా సత్యనారాయణ

ఐ.పోలవరం (ఆంధ్రజ్యోతి), జూన్ 14: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయ సహాయ కమిషనర్‌గా వి. సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిషనర్‌గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు ఆలయ అర్చకులు, పురోహితులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఏసీగా పని చేసిన మాచిరాజు లక్ష్మీనారాయణ సర్పవరం భావన్నారాయణ ఆలయానికి బదిలీ అయ్యారు. ఏసీగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సత్యనారాయణ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును మర్యాదపూర్వకంగా కలిసి అప్పనపల్లి బాలబాలాజీ చిత్రపటాన్ని బహూకరించారు. ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు ఉన్నారు.

నేడు ఫాదర్స్ డే



నాన్నకు ప్రేమతో..

- రాజమహేంద్రవరం, కాకినాడ, అనపర్తి, ఉప్పలగుప్తం/ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు నాన్నలు కఠినంగా ఉండేవారు. తమ పిల్లలకు విలన్లుగా కనిపించేవారు. కేవలం చదువుకు మాత్రమే విలువ ఇచ్చేవారు. ఏదైనా కొనమంటే పదేపదే ఆలోచించేవారు. ఇప్పుడు వద్దు అని కరాఖండీగా చెప్పేవారు. చదువుకొంటేనే మంచి భవిష్యత్తు అని వారి స్టైల్లో చెప్పేవారు. అయితే వారి మాటలు చెవికెక్కించుకున్న పిల్లలు నేడు మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అప్పట్లో పిల్లలు కూడా నాన్నను ఏదైనా అడగాలంటే భయపడేవారు. అమ్మ ద్వారానే నాన్నకు విషయం వెళ్లేది.. **కానీ నేడు...** నాన్నలు పిల్లలకు హీరోలుగా మారారు. చాలా మంది వారిని స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇక నాన్నలు కూడా వారి పిల్లలను గారాబంగా పెంచుతున్నారు. వారు అడిగింది ఏదీ కాదనకుండా కొనిచ్చేస్తున్నారు. నాన్న, పిల్లల మధ్య బంధం ఫ్రెండ్స్‌లా మారిపోయింది. ఏ విషయాన్నైనా నాన్నతో ఈజీగా పంచుకునే రోజులు వచ్చేశాయి. ఆఖరికి తాను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తున్నాను అనే మాటను కూడా నేడు పిల్లలు సులువుగా నాన్నకు చెప్పేస్తున్నారంటే.. నాన్న మారిపోయాడని అర్థమవుతోంది.

● నాన్న ఎందుకో వెనుకబడ్డాడు..

బిడ్డలపై చూపించే ప్రేమలో తల్లిదండ్రుల పాత్రలు సమానం. కుటుంబం గురించి ఆలోచించే క్రమంలో, అవసరాలను తీర్చే దారిలో అమ్మానాన్నా సమానమే అయినా నాన్న కాస్త ఎక్కువగా టెన్షన్ పడుతూ ఉంటాడు. సాధారణంగా ఏ ఇంట్లో అయినా చూస్తే.. అందరికంటే తక్కువ బట్టలు, చెప్పుల జతలు నాన్నకే ఉంటాయి. వాటి గురించి కూడా పెద్దగా పట్టించుకోడు. కానీ పిల్లల మనసులో మాత్రం నాన్న ఎప్పుడూ కాస్త వెనుకబడుతూనే ఉంటాడు. ఎందుకంటే.. అమ్మ తిడితే లాలనగా ఉంటుంది.. నాన్న కోప్పడితే ఆక్రోషంలా కనిపిస్తుంది. నిజానికి నాన్న కోపాన్ని పిల్లల భవిష్యత్తు ప్రతి క్షణం శాసిస్తూ ఉంటుంది. అందుకే బయటకు కఠినంగా ఉంటూ లోపల వెన్నపూసలా కరిగిపోతూ ఉంటారు. చాలా మంది పిల్లలు తల్లికి ఇచ్చినంత ప్రాధాన్యం తండ్రికి ఇవ్వరని సర్వేలు చెబుతున్న వాస్తవం. అయితే జీవిత కథలు చూసుకుంటే నాన్న నుంచి నేర్చుకున్న వాళ్లే ఎక్కువగా ఉంటారు. అది మంచి అయినా.. చెడు అయినా. కుటుంబానికి ఎంత చేసినా అధిక శాతం తండ్రులు పిల్లల దృష్టిలో చులకనే. దీనివల్ల లోలోపల కుమిలిపోయే తండ్రులు ఎంతో మంది ఉన్నారు. కాస్త ఎదిగిన పిల్లలు నీకెందుకు నేనున్నాగా అని నాన్నతో ఒక్క మాట అంటే మౌనంగా ఎంతో మురిసిపోతారు. ఆ మాటను వంద మందికి చెప్పుకొని గంతులు వేస్తారు. అందుకనే నాన్నను అర్థం చేసుకుంటే జీవితాన్ని ఔపోసన పట్టినట్టే. ఇక అంతర్జాతీయ పితృ దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ నెలలోని మూడో ఆదివారం జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 60 దేశాల్లో తండ్రుల గౌరవార్థం ఈ వేడుక నిర్వహిస్తున్నారు. మాతృ దినోత్సవం మాదిరిగానే పితృ దినోత్సవం ఉండాలనే తలంపుతో అమెరికాకు చెందిన సొనోరా అనే మహిళ పితృ దినోత్సవంపై ప్రచారం మొదలుపెట్టారు. దీంతో 1910లో మొదటిసారిగా ఫాదర్స్ డేని నిర్వహించారు.

మంచి స్నేహితులం.. - ఎస్పీ నరసింహ కిషోర్

నాన్న దూసి ధర్మారావు. టీచర్, జూనియర్ లెక్చరర్‌గా పనిచేశారు. ఆయన చాలా ఫేమస్ పర్సనాలిటీ. ఆయన నన్ను ఎప్పుడూ స్నేహితుడి మాదిరిగానే చూశారు. బిగ్ రోల్ మోడల్. ఆయన పూర్తి ప్రభావం నా మీద ఉంది. చిన్నప్పటి నుంచీ ఆయనతో కలిసే తిరిగాను. ఆయన ప్రపంచం చాలా పెద్దది. గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆయన ప్రిన్సిపాల్‌గా చేసే సమయంలో 8, 9, 10 అక్కడే చదువుకున్నాను. మంచి సామాజిక, సాహిత్య సేవకులు. చరిత్ర సంస్కృతిని కాపాడడంలో గొప్ప కృషి చేశారు. మంచి రచయిత, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. ఏ రోజూ నా జీవిత మార్గాన్ని నిర్దేశించలేదు. చాలా స్వేచ్ఛగా ఆలోచనలు చేసుకొనే అవకాశం ఇచ్చారు. ఆయనకు నెగిటివ్ ఆలోచనలు, మాటలు ఎప్పుడూ నచ్చేది కాదు. 'మంచి ఉద్యోగం చేస్తే చాలు. సొసైటీకి నీ కంట్రిబ్యూషన్ ఉంటే చాలు. టీచర్, అటెండర్ కూడా కంట్రిబ్యూట్ చేయవచ్చు. సామాజిక స్పృహ ఉండాలి. పక్కవాడి మంచి గురించి ఆలోచించాలి. సొసైటీని విమర్శించుకుంటూ బతకొద్దు. అప్పుడు మనల్ని వదిలేసి సమాజం ముందుకు సాగిపోతుంది. సమాజంలో అడ్డంకులను అధిగమించి మనం చేయాలనుకున్నది చేసుకుపోవాలి. పదిమందికి ఉపయోగంగా ఉండాలి' అని నిరంతరం చెబుతూ ఉండేవారు. 'ఆయన దినచర్య ఉదయం ఆరు గంటలకు ప్రారంభం అయ్యేది. ఉద్యోగం, సామాజిక సేవలు చూసుకొని రాత్రి 11గంటల సమయంలో ఇంటికి చేరేవారు. సమాజంలోని వివిధ అంశాలు, సేవ వంటి వాటిపై ఇద్దరి మధ్యా తరచు చర్చ నడుస్తుండేది. ఏ రోజూ ఇది చదువని ఆయన చెప్పలేదు. అల్లరి చేస్తున్నా ఏమీ అనేవారు కాదు. ఎవరికి వారే తమ తప్పు తెలుసుకొని దాని నుంచి బయటకు రావాలి. ఎవరో చెబితే తెలుసుకోవడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ఈరోజు బతికున్నామంటే చక్కగా, హ్యాపీగా ఉండాలి. కష్టాన్ని అంగీకరించకూడదు. దానిపై ఫైట్ చేయాలి. దుఃఖం వచ్చిందని అక్కడే ఆగిపోకూడదు. దాని నుంచి బయటపడే మార్గం కూడా మన దగ్గరే ఉంటుంది' అని చెప్పేవారు. ఆయన చాలా పుస్తకాలు రాశారు. రసతరంగిణి, స్టోరీ ఆన్‌స్టోన్ వంటి పుస్తకాలు రాశారు. ఆయన నాకు ప్రతి క్షణం గుర్తొస్తూనే ఉంటారు. నేను, సమాజం కూడా ఆయనను మరిచిపోయే రోజు ఉండదు. దురదృష్టవశాత్తూ ఆయన 2017లో కాలం చేసినా నాతోనే ఎప్పుడూ ఉంటారు.

- దూసి నరసింహ కిషోర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ




'తూర్పు' ఎస్పీ నరసింహ కిషోర్.. తండ్రి ధర్మారావు

మా నాన్నే హీరో

నాన్న పీఎంపీ.. పిల్లలు డాక్టర్లు



నా తండ్రి షేక్ చినవలియా. మాది ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి. నిరుపేద కుటుంబం. ఆయన తన తండ్రికి సహాయపడాలన్న ఆలోచనతో ఒక ఆసుపత్రిలో సహాయకుడిగా చేరారు. తర్వాత స్వగ్రామంలో పీఎంపీగా వైద్య సేవలందిస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. కానీ తన పిల్లలు తనలా సంచికట్టు డాక్టర్లు కాకూడదని, వైద్య వృత్తిలో పట్టభద్రులుగా చూడాలని కలలు గన్నారు. పిల్లలు వైద్యులుగా పట్టాలు తీసుకుని సమాజంలో గొప్పగా జీవించాలన్నది ఆయన సంకల్పం. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కుంటూనే మమ్మల్ని మెడిసిన్ చదివించారు. మేం ముగ్గురం. పెద్ద కుమారుడు అహ్మద్ అలీషా దంత వైద్యునిగా క్లినిక్ నడుపుతున్నారు. కుమార్తె హసీనా ప్రస్తుతం రావులపాలెం మండలం ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి. మూడో కుమారుడు అబ్దుర్‌రెహమాన్ బెంగళూరులో ఎంబీఏ చదువుతున్నాడు. పీఎంపీగా మా తండ్రి మమ్మల్ని వైద్య పట్టభద్రులుగా చూడాలని ఎన్నో ఆర్థిక ఇబ్బందులను తట్టుకున్నారు. తలకు మించిన భారం ఎందుకని పలువురు సలహాలిచ్చినా పట్టించుకోకుండా మా ఉన్నతి కోసం నిత్యం తపించారు. ఆయన కడుపున పుట్టడం నిజంగా ఎంతో అదృష్టం. ఎప్పటికీ మా నాన్నే మా హీరో.

నాన్న బాటలోనే రాజకీయాల్లోకి..

అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ప్రతి ఒక్కరికి కొన్ని కలలుంటాయి. ఇలా ఎదగాలని, ఇలా స్థిరపడాలని ఉంటుంది. కానీ ఒక్కోసారి కుటుంబ ప్రభావంతో మనం కోరుకున్న దారి మారిపోతుంటుంది. నేను డాక్టర్ కావాలనుకున్నా. కానీ ఇంజనీర్ అయ్యా. కానీ కుటుంబ వారసత్వ రాజకీయాల ప్రభావంతో రాజకీయ నేతగా మారిపోయా. నా తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి 1970 ప్రాంతంలో అనపర్తి మండలం రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై రాజకీయ ఆరంగ్రేటం చేశారు. తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవకు ముందుకు వచ్చి అనపర్తి ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు గెలిచి నియోజకవర్గ ప్రజలకు సేవలందించారు. నాకు మాత్రం డాక్టర్ కావాలనేది కల. అనుకోనివిధంగా ఇంజనీరింగ్ కోర్సు చదివి బీఈ పట్టా పొందా. పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకోవాలని వంశీ పవర్ పేరుతో పవర్‌ప్లాంట్‌ను స్థాపించారు. కానీ ఎన్నికల సమయంలో తండ్రికి చేదోడుగా నిలిచేవాడిని. నా తండ్రికి నాటికలపై ఉన్న మక్కువతో ఏర్పాటుచేసిన మూలారెడ్డి కళా పరిషత్ బాధ్యతలను వేసుకున్నా. తర్వాత నా తండ్రి వారసుడిగా 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించా. తిరిగి 2024 ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి రెండవ పర్యాయం ఎమ్మెల్యేగా గెలుపొందా. సాధరణంగా ఒక కుటుంబంలో తాను, భార్య బిడ్డలు బావున్నారా అనే చూసుకుంటారు.. కానీ తనను నమ్ముకున్న కుటుంబాలు ఎలా ఉన్నాయి, వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నిత్యం ఆలోచనలతో ముందుకుసాగుతూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న మూలారెడ్డికి కొడుకుగా జన్మించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నా.



తండ్రి మూలారెడ్డితో అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

నీట్-2025 ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం

కిరీటికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ఆలిండియా స్థాయి ర్యాంక్‌లతో సత్తాచాటిన విద్యాసంస్థ

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లతో ప్రభంజనం సృష్టించారు. ఓపెన్ కేటగిరిలో దర్భా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా స్థా యిలో 19వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థలో శనివారం విజయోత్సవం జరిపారు. ర్యాంకర్లకు స్వీట్లు తినిపించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో తిరుమలరావు మాట్లాడారు. తమ విద్యార్థులు కె.ఈప్సిత్ కశ్యప్ 12వ ర్యాంక్, టి.సాహితి 32వ ర్యాంక్, కేవీవీ నాగసాయి పవన్ 154వ ర్యాంక్, ఎం.సూర్య సంతోష్ రెడ్డి 880వ ర్యాంక్, ఎల్.అభిషేక్ 888వ ర్యాంక్, టి.రామచంద్రన్ 1145వ ర్యాంక్, ఎల్.వర్షిత్ 1237వ ర్యాంక్, పి.ప్రశంస 1851వ ర్యాంక్, కె.విన్షిత 1909వ ర్యాంక్ కైవసం చేసుకున్నారని తెలిపారు. అలాగే వెయ్యి లోపు 6 ర్యాంక్‌లు, 5వేలలోపు 35, పది వేల లోపు 71, 20వేలలోపు 138, 30వేలలోపు 189 ర్యాంక్‌లు సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు 250 మంది పైబడి ఎంబీబీఎస్ సీట్లు సాధించగలరన్నారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలతో కలిసి తిరుమలరావు అభినందించారు.



స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రామ్‌కిరీటి



ర్యాంకర్లతో చైర్మన్ తిరుమలరావు

వైద్యురాలిగా సేవలందిస్తా

టి.సాహితి, 32వ ర్యాంకర్



నీట్‌లో ఆలిండియా స్థాయిలో 32వ ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. తిరుమల విద్యాసంస్థల్లో చదువుకోవడం వల్లే ర్యాంక్ సాధించగలిగాను. ఫ్యాకల్టీ ఇచ్చిన ప్రోగ్రామ్స్‌ను ఎప్పటికప్పుడు చూసుకుంటూ సలహాలు, సూచనలు పాటిస్తూ కష్టపడి చదివాను. చైర్మన్ తిరుమలరావు ప్రోత్సాహం, నా తల్లిదండ్రులు టీవీ ఆర్ రాజు, నాగమణిల ప్రోద్బలం ఉంది. ఆర్థోపెడిక్ వైద్యురాలిగా సేవలందించాలనే లక్ష్యంతో చదువుతున్నా.

శివమణిదీప్‌కు 92వ ర్యాంకు



శివమణిదీప్

రావులపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన తుమ్మూరి శివమణిదీప్ నీట్ ఫలితాల్లో 92(ఎంబీసీ ఎన్‌సీఎల్) ర్యాంకు సాధించాడు. ఎంఎస్ న్యూరోసర్జన్ చేయడమే లక్ష్యంగా ప్రిపేర్ అయినట్టు మణిదీప్ తెలిపాడు. నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించడంతో తనతో పాటు కుటుంబ సభ్యులు ఆనందిస్తున్నారన్నారు. అతడి తండ్రి వెంకటరత్నం రైల్వే ఉద్యోగి కాగా, తల్లి నాగలక్ష్మి గృహిణి.

సంజనకు 227వ ర్యాంకు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో జిల్లా కాకినాడ సర్పవరానికి చెందిన బొర్రా సంజన ఆల్ ఇండియా 227వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. దేవుని మీద నమ్మకం వల్ల ఇది సాధ్యమైంది. తల్లిదండ్రులకు కృతజ్ఞతలుతెలియజేయాలనుకుంటున్నా.



తల్లిదండ్రులతో సంజన

పాములేరు వాగులో ఇద్దరు యువకుల గల్లంతు



గల్లంతైన సాలీష్, రవితేజ ఫైల్‌ఫొటోలు

మారేడుమిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతరామరాజు జిల్లా మారేడుమిల్లి పాములేరు వాగులో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. శనివారం విజయవాడ నుంచి 10 మంది స్నేహితులు మారేడుమిల్లి పర్యాటకానికి వచ్చారు. పాములేరు వాగులో డి.సాలీస్ (23), కటకం రవితేజ (30), మరో ఇద్దరు యువకులు స్నానానికి దిగారు. వాగులో వారు గల్లంతవుతుండగా తోటి స్నేహితులు రక్షించే ప్రయత్నం చేశారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడగా సాలీస్, రవితేజ గల్లంతయ్యారు. దీంతో మిగిలిన స్నేహితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శనివారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ గల్లంతైన ఇద్దరు యువకుల ఆచూకీ లభించలేదు.

'ఆదిత్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

● అఖిల భారతస్థాయిలో 109, 227, 890 ర్యాంకులు కైవసం

కాకినాడ రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి అఖిల భారతస్థాయిలో 109, 227, 890 ర్యాంకులు కైవసం చేసుకున్నారని విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వీరంరెడ్డి సాయిభవ్యహర్షిణి 625 మార్కులతో 227వ ర్యాంకు, దగ్గుమటి సవన్‌కార్తికేయ 109వ ర్యాంకు, డి.శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు సాధించారన్నారు. అంతేకాకుండా 720 మార్కులకుగానూ 550మార్కులపైన 12మంది ఆదిత్య విద్యార్థులు పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి, హాస్టల్స్ డెరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.



సవన్ కార్తికేయ 109వ ర్యాంకు | సాయిభవ్యహర్షిణి 227వ ర్యాంకు | శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు

'ఏయూ' దూరవిద్య తరగతులు ప్రారంభం

కాకినాడ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2022 విద్యాసంవత్సరం ఫైనల్ ఇయర్, 2024 క్యాలెండర్ ఇయర్ 3,4 సెమిస్టర్లు, క్యాలెండర్ ఇయర్ 2025 1,2వ సెమిస్టర్ విద్యార్థులకు శనివారం తరగతులు ప్రారంభమైనట్టు పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు తెలిపారు. బీఏ,బీకామ్ విద్యార్థులకు వారాంతపు తరగతులు కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 5.30 వరకూ జరుగుతాయన్నారు. ఈ తరగతులను జూలై 13వరకూ వారంలో ప్రతీ శని, ఆదివారాలు నిర్వహించనున్నామని ఇతర వివరాలకు 9848405370కు ఫోన్‌చేయాలని సెంటర్ సమన్వయకర్త డాక్టర్ కె.నాగేశ్వరావు తెలిపారు

తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి



నదిలో శివ మృతదేహం

కోటనందూరు, జూన్14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా పాతగాజువాకకు చెందిన మునుశాల శివ స్థానికంగా రెండేళ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం తాండవ నదిలో స్నానానికి దిగి మృతిచెందాడు. దీంతో స్థానికులు ఎస్ఐ టి.రామకృష్ణకు తెలిపారు. గాజువాకలో ఉన్న మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తునికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

తాళ్లరేవులో కుటుంబసభ్యుల ధర్నా



తాళ్లరేవులో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

తాళ్లరేవు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో ముక్కుపచ్చలారని పసికందు మృతిచెందిందని, తమకు న్యాయం చేయాలని కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగి పంచాయతీ పెదబొడ్డువెంకటాయపాలెనికి చెందిన బాధితులు తాళ్లరేవు ఆసుపత్రి వద్ద మత్స్యకార నాయకుడు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. పెదబొడ్డువెంకటాయపాలెనికి చెందిన చెక్కా మాధురి డెలివరీ కోసం తాళ్లరేవు ఆసుపత్రిలో చేరింది. శనివారం తెల్లవారుజామున ఆమెకు పురిటినొప్పులు రాగా వైద్యులు ఆసుపత్రిలో ఉండి కూడా పట్టించుకోకపోవడంతో స్వీపరు డెలివరీ చేసింది. శిశువు ఉమ్మ నీరు ఎక్కువ తాగడంతో మృతి చెందిందని వైద్యులు బాధితులకు చెప్పకుండా అంబులెన్స్‌లో కాకినాడ తరలించారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి వైద్యులు శిశువు మరణించిందని చెప్పడంతో మృతదేహంతో బాధితులు, బంధువులు తాళ్లరేవు ఆసుపత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. రోడ్డుపై బాధితులు బైఠాయించి సూపరింటెండెంట్, డ్యూటీ డాక్టరు స్నేహలత, సిబ్బందిని సస్పెండ్ చేసి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు, బంధువులు ధర్నా చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఆందోళనకారులతో ప్రభుత్వ విప్, ము మ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు చర్చలు జరిపి న్యాయం చేస్తామని ఆందోళన విరమించారు. విచారణ కమిటీ సభ్యులు వినోద్, సుజాత తాళ్లరేవు ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించి కలెక్టరు నివేదించి 48 గంటల్లో చర్యలు తీసుకుంటామన్నారు. స్టాఫ్‌నర్సు ఇందిర నిర్లక్ష్యం కారణంగా భావించి సస్పెండ్‌చేసినట్టు తెలిపారు.

దోపిడీకి బయలుదేరి.. గంజాయితో పట్టుబడి...

● కొవ్వూరులో ఏడుగురి అరెస్ట్

● కారు, కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం



కొవ్వూరులో గంజాయితో ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఏడుగురిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. కారులో అనుమానస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 26 కిలోల గంజాయి, బాలినో కారు, 2 కత్తులు, ఇనుపరాడ్డు, 5 సెల్‌ఫోన్లు, రూ.1130 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించి వివరాలు తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరుకి చెందిన సాకావంశీ, తణుకు పాటికచ్చివారి వీధికి చెందిన ఇజ్జాడ పాపినాయుడు, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి సామేలు, పాలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురుప్రసాద్, పెరవలికి చెందిన చినిమిల్లి శివకృష్ణ, నవరపు ప్రవీణ్ కలిసి ఒక ప్రైవేటు ట్రావెల్స్ నుంచి బాలినో కారును అద్దెకు తీసుకుని దోపిడీ చేయడానికి నిర్ణయించుకుని బయలుదేరారు. దొంగతనం చేయడానికి ఇనుపరాడ్డు, పెద్ద కత్తి, చిన్న కత్తిని కారులో పెట్టుకుని శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో బంగారపు షాపులో దొంగతనం చేయడానికి సన్నాహం చేసుకున్నారు. ముందుగా రెక్కీ నిర్వహించి అక్కడ నుంచి వస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా దారవరంలో 26 కిలోల గంజాయిని తీసుకుని కారులో పెట్టుకుని పెరవలి వస్తున్నారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోలిగేటుసెంటర్‌లో శనివారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు కారును నిలుపుదలచేసి అనుమానస్పదంగా కనిపించిన ఏడుగురిని విచారించి అరెస్టు చేశారు. ఏడుగురిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పం పించామన్నారు. కేసులో ప్రతిభ కనబర్చిన సీఐ విశ్వం, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు.

కొండగుంటూరులో గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజానగరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని ఒక లేఅవుట్‌లో రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం డీఎస్పీ శ్రీకాంత్, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ ఈ వివరాలను వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగుడ పంచాయతీకి చెందిన చంద్ర కులదీప్ అలియాస్ సురేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరుకి చెందిన చందన్ మండల్ గంజాయిని నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కారులో గంజాయి తీసుకొచ్చినట్టు తెలుసుకుని శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేశారు. 11 ప్యాకెట్లలో 23.101 కిలోల గంజాయిని గుర్తించారు. వ్యాన్, కారు, 2 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, సురేష్, చందన్‌ను కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ వ్యాపారానికి సూత్రధారి రఘువీర్ రాయ్, అతడి భార్య ప్రశాంతి పరారీలో ఉన్నట్టు వివరించారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన ఎస్ఐ నాగార్జున, సిబ్బంది కరీం, సురేష్, త్రిమూర్తులు, మహేశ్వరరావు, మురళీ, రాంప్రసాద్‌ను అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు నాగార్జున, ప్రియ కుమార్, నారాయణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు పై నుంచి పడి..



అశోక్ (ఫైల్)

మామిడికుదురు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిచెట్టు చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం తాడివారి మెరకలో శుక్రవారం రాత్రి జరిగింది. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాడి అశోక్ కుమార్ (35) శుక్రవారం కొబ్బరి బొండాల కోసం చెట్టు ఎక్కి జారి పడడంతో తీవ్రగాయాలయాయి. రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పెయింటర్‌గా పనిచేసే అశోక్‌కుమార్‌కు భార్య నాగమణి, 15ఏళ్ల కుమార్తె స్వప్న, 13ఏళ్ల కుమారుడు సంతోష్ ఉన్నారు. తండ్రి మరణించడంతో చిన్నారులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తమిళనాడుకు తరలిస్తున్న బాల కార్మికుల గుర్తింపు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు రైలులో తరలిస్తున్న బాల కార్మికులను గుర్తించి సంరక్షణా కేంద్రానికి పంపించామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీఎస్ఆర్పీ జయరాంప్రసాద్ ఉత్తర్వులతో జీఆర్పీ, ఆర్పీ ఎఫ్ పోలీసులు బచ్‌పన్ బచావో ఆందోళన్ టీమ్‌తో కలిసి రాజమహేంద్రవరంలో రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. శనివారం తెల్లవారు జామున జసిద్- తాంబరం వారాంతపు రైలులో తనిఖీలు చేస్తుండగా 10మంది బాలబాలికలను భవన నిర్మాణ పనుల నిమిత్తం తమిళనాడుకు తర లిస్తుండడం గుర్తించామన్నారు. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన మనీషా, సరిత, సుమి పొటల్, జార్ఖండ్‌కి చెందిన తురం సవ్యాన్, లవకుష్‌రామ్, కరణ్ కుమార్, బస్దేవ్‌షా, బీహార్‌కి చెందిన విక్రమ్‌కుమార్ పాశ్వాన్, రోహిత్ కుమార్, ఉమాకాంత్ కుమార్‌లను జిల్లా బాలల సంర క్షణ సమితికి అప్పగించామన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసి జార్ఖండ్‌లో జసిద్ జీఆర్పీకి పంపారు.

298 సముద్రపు తాబేళ్లు స్వాధీనం

గోకవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న 298 సముద్రపు తాబేళ్లను శనివారం గోకవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని కాజా రామ్‌కుమార్‌కు చెందిన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా ఉన్న ఏడు గోనె సంచులను స్థానికుల సమాచారంతో గుర్తించామని, వాటిని తెరిచి చూసేసరికి 298 సముద్రపు తాబేళ్లు ఉన్నాయన్నారు. తాబేళ్లను అక్రమ రవాణా చేస్తున్నట్టు విచారణలో తెలుసుకుని వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించామన్నారు. కాగా వాటిలో 22 తాబేళ్లు మృతి చెందినట్టు అటవీ అధికారులు తెలిపారు. మిగిలిన తాబేళ్లను దేవీపట్నం మండలం పోసమ్మగండి సమీపంలోని గోదావరిలో విడిచి పెట్టినట్టు చెప్పారు. కాగా తాబేళ్లను రవాణా చేస్తూ పరారైన నిందితులను కోరుకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



గోకవరంలో తాబేళ్లతో ఉన్న గోనె సంచులు

కిర్లంపూడిలో అధిక వర్షపాతం

కిర్లంపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సుమారు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోనే కిర్లంపూడి మండలంలో 28.2 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు ఏఎస్‌వో నాయుడు తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

రాజోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు కోరారు. సోంపల్లిలో శనివారంరాజోలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు వీపీవో జి.ప్రభావతి, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు..

అంతర్వేది సహాయ కమిషనర్‌గా ప్రసాద్

అంతర్వేది, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంకేటీఎన్వీ ప్రసాద్ శనివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి: ఎమ్మెల్యే గిడ్డి




మామిడికుదురు: పాశర్లపూడిలో రక్తదానం చేసిన దాతలకు పండ్లు అందిస్తున్న గిడ్డి సత్యనారాయణ, రాజోలులో రక్తదానం చేసిన దాతలను అభినందించి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ

మామిడికుదురు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశర్లపూడి కొండాలమ్మచింత వద్ద గ్రామానికి చెందిన మానవసేవే-మాధవసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. రక్తదాన చేసిన దాతలకు పండ్లు అందించారు. అమలాపురానికి చెందిన బుద్ధాల నాగరత్నం మెమోరియల్ వలంటరీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 32మంది రక్తదానం చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఫౌండేషన్ చైర్మన్ పి.సత్యనారాయణ, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తులా శ్రీనివాస్, మందా గాంధీ, పేరూరి సతీష్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యవంతమైన సమాజం

రాజోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో రక్తదానం పాత్ర ఎంతో కీలకమైందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజోలు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. యువత రక్తదానం చేయాలన్నారు. రక్తదానం ద్వారా పలువురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసిన దాతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు

అంబాజీపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావచ్చని యోగా గురువు ఆకుల శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అంబాజీపేట శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వ ర్యంలో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో శనివారం పలువురు రక్తదానం చేశారు. ఈసందర్భంగా రక్తదానం చేసిన పలువుర్ని అభినందించారు.

చిరంజీవి స్ఫూర్తితో 34సార్లు రక్తదానం



మలికిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చిరంజీవి స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వాడినని మలికిపురం మమత హోటల్ అధినేత మేడిచర్ల శేఖర్ అన్నారు. 2009 నుంచి ఇప్పటికి 34సార్లు రక్తదానం చేశానన్నారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదాత కావడం గొప్ప పరిణామమన్నారు. చిన్నప్పటి నుంచి అదే స్ఫూర్తితో తాను, తన స్నేహితులు రక్తదాన చేయడంలో ముందుంటున్నామన్నారు.

మూతపడిన కూనవరం తాగునీటి ప్రాజెక్టు

- తాగునీటి కోసం అల్లాడుతున్న జనం
- చల్లపల్లి ప్రాజెక్టుకు అదనపు భారం
- అధికారుల వ్యూహం తారుమారు



కూనవరం తాగునీటి ప్రాజెక్టు చెరువు అడుగంటిన దృశ్యం

ఉప్పలగుప్తం, జూన్, 14(ఆంధ్రజ్యోతి): కూనవరం ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు మూత పడింది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఎండిపోవడంతో ఈ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అసలే వేసవి ఎండలతో అల్లాడుతున్న జనానికి గుక్కెడు తాగునీరు అందకపోతే పరిస్థితిని ఊహించుకోవచ్చు. ఈప్రాజెక్టు ద్వారా రోజూ 8,20,000లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. కూనవరం, పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురం, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, చినగాడవిల్లి, పెదగాడవిల్లి, మునిపల్లికోటిగట్టు ప్రాంతాల్లోని ట్యాంకులకు ఈప్రాజెక్టు ద్వారా తాగునీరందిస్తున్నారు. ఈనెల10వ తేదీ నుంచి ఈప్రాజెక్టు మూతపడింది. అధికారుల అంచనాలు తారుమారు కావడంతో ఈపరిస్థితి ఏర్పడినట్టు తెలిసింది. ప్రతిఏటా పంట కాల్వల మూసివేత అనంతరం ఈచెరువులో 32రోజులకు సరిపడా నీటినిల్వలుంటాయి. ఈసారిదాదాపు 45 రోజుల వరకు నీరు నిల్వఉంది. పంటకాల్వలకు నీరు రాకపోవడంతో ప్రాజెక్టు మూతపడింది.

మొత్తం గ్రామాలపై పడింది...

కూనవరం ప్రాజెక్టు మూతపడటం మండల ప్రజలకు గోరుచుట్టు మీద రోకటి పోటులా పరిణమించింది. అసలే తగినంతగా నీరు సరఫరా లేక వేసవి ప్రారంభం నుంచి తిప్పలు పడుతున్న జనానికి ఇప్పుడు మరింతగా తాగునీటి వెతలు పెరిగాయి. కూనవరం ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు కూడా చల్లపల్లి ప్రాజెక్టు నుంచే నీటి సరఫరా చేయాల్సి వస్తోంది. అంతేకాదు చల్లపల్లి పంచాయతీ వాటర్ ప్రాజెక్టు చెరువుకు సైతం చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు నుంచే నీటిని పంపిస్తున్నారు. ఇక ఎస్.యానాం గ్రామ తాగునీటి ప్రాజెక్టు చెరువు ఎండిపోవడంతో అక్కడికి కూడా చల్లపల్లి ప్రాజెక్టు నుంచే నీటిని పంపింగ్ చేస్తున్నారు. అంటే గతంలో చల్లపల్లి ప్రాజెక్టు ద్వారా 18గంటలు ఏకధాటిగా పంపింగ్ జరిగితే ఆప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరా సజావుగా జరిగేది. ఇప్పుడు 36గంటలు రెండు లైన్లద్వారా పంపింగ్ చేస్తున్నారు. ఈకారణంగా ఏగ్రామానికి ఎప్పుడు నీరు వస్తుందో చెప్పలేని పరిస్థితి. గతంలో జూన్ ఒకటో తేదీన పంటకాల్వకు నీరు రావడంతో వెంటనే చెరువులను నింపుకునేవారు. ఈఏడాది కాల్వలకు నీరు వదిలి 15రోజులు అయినా అమలాపురం- చల్లపల్లి కాల్వకు నీరు వదలక పోవడంతో తాగునీటి కష్టాలు సంభవించాయని పలువురుఆందోళనవ్యక్తం చేస్తున్నారు.

అందరికీ తాగునీరందేలా చర్యలు తీసుకుంటున్నాం: సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పంటకాల్వకు అనుకున్న సమయానికి నీరు రాకపోవడంతో కూనవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అడుగంటింది. దీంతో ఇతర మార్గాల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. ఎస్.యానాం, చల్లపల్లి పంచాయతీ ప్రాజెక్టు చెరువులు సైతం అడుగంటడంతో చల్లపల్లి మెయిన్ ప్రాజెక్టు నుంచే నీటిని పంపింగ్ చేస్తున్నాం. ఈకారణంగా ఆయా ప్రాంతాలకు నీటి సరఫరాలో కొన్ని ఇబ్బందులున్న మాట వాస్తవమే. అయినప్పటికీ అందరికీ తాగునీరందేలా ప్రయత్నాలు చేస్తున్నాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం.

ఘనంగా శారదాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



యానాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్‌లోని శ్రీశారదాదేవి అమ్మవారి ఆలయం 20వ వార్షికోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గాంధీనగర్‌కు చెందిన పెనుపోతు భైరవస్వామి, దేవి దంపతులు, కుమార్తె సాయిశార్వాణి, కుమారుడు సత్యవెంకట శ్రీవర్మ, తల్లి ధనవతితో పాటు పలువురు ఆలయంలో చండీహోమం నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రతినిధి మల్లాడి సతీమణి ఉదయలక్ష్మి, యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు వెగేశ్న గోపాల్‌రాజు, పొన్నాడ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

నిరుపేదలకు బాసటగా సీఎం సహాయనిధి



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి నిరుపేదకు బాసటగా సీఎం సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి రూ.25,00,287 విలువైన చెక్కులను 33మందికి అందించారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, డీవీవీ సత్యనారాయణ, యల్లమిల్లి కృష్ణవేణి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, కె.సత్యనారాయణరాజు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, ఆదిమూలం సూరయ్యకాపు, నూకపెయ్యి ప్రసన్న కుమార్, బిళ్ళా ప్రభాత్, అడబాల తాతకాపు, మద్దుల అనూరాజేశ్వరి పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో రక్తదానం

అమలాపురం టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీస్వామివివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తదానం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తలసేమియా పేషంట్లకు ప్రత్యేకంగా యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఇప్పటి వరకు ఎంతో మంది దాతల సహకారంతో 28వేల మందికి పైగా రోగులకు రక్తదానం చేశామని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ పి.అన్నపూర్ణ, దొడ్డా కాశీ, సీహెచ్ రాజశేఖర్, ఎ.కుమారి, ఎ.శిరీష, కె.శివకుమారి, ఆర్.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, జూన్14(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి ఎస్.రాజబాబు సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ముక్కామల పీహెచ్‌సీ వద్ద శనివారం ర్యాలీ నిర్వహించారు. నివాస ప్రాంతాల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే డీఐజీ బాపూజీ పూజలు

అంతర్వేది, జూన్ 14(ఆంధ్రజ్యోతి):అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సౌత్‌సెంట్రల్ డీఐజీ తోకల వల్లేశ్వరబాపూజీ శనివారంకుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ అందజేశారు.

సిద్ధివినాయకుడికి పూజలు



కాట్రేనికోన, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయ సన్నిధిలో ఉన్న శ్రీసిద్ధివినాయకునికి శనివారం సంకష్టహర చతుర్థి సందర్భంగా పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, అలంకరణ, అష్టోత్తరపూజ, దుర్వాయుగ్మపూజా కార్యక్రమాలు జరిగాయి. బ్రహ్మశ్రీ ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, తాతపూడి గోపి, గ్రంధి రామ్‌ప్రసాద్, చెరుకు కృష్ణ, సంసాని పాండు రంగారావు, చెరుకు బాపిరాజు పాల్గొన్నారు.

నరసింహుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు




అంతర్వేది: క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, మామిడికుదురు: బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

అంతర్వేది, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియడంతో అంతర్వేది పుణ్యక్షేత్రం భక్తుల తాకిడితో కళకళ్లాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తొలుత క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్యూలైన్ ద్వారా స్వామిని దర్శించుకున్నారు. ఉదయం అభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ మేరకు ఆలయ అధికారులు బఫే ద్వారా అన్న ప్రసాదాన్ని భక్తులకు అందించారు. సుమారు 3వేల మంది భక్తులు నిత్యాన్నదానంలో స్వామివారి ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వివిధ సేవల ద్వారా శనివారం ఒక్కరోజు రూ.1,11,823, అన్నదాన ట్రస్టు విరాళాల ద్వారా రూ.1,03,709 మొత్తం రూ.2,15,532 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

బాలబాలాజీకి రూ.4.88లక్షల ఆదాయం

శనివారం స్వామివారిని 6వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో 3500మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.4,88,884 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది, సహాయ కమిషనర్ ఏర్పాట్లు చేశారు. శనివారం నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన బి.శ్రీనివాసరావు బ్రదర్స్ రూ.10,116 విరాళంగా అందించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

బాలబాలాజీస్వామికి విశేష పూజలు

మామిడికుదురు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం భక్తులతో పోటెత్తింది. శనివారం పురస్కరించుకుని స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ఈనెల 20వ తేదీ వరకు గడువు

యానాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ద్రాక్షారామ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేయాయుధన్ తెలిపారు. డిప్లమో సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. యానాం, కాకినాడ, కోనసీమ జిల్లాల అభ్యర్థులు ఈనెల20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

బదిలీల తీరు ప్రశంసనీయం

అమలాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు నిర్వహించిన తీరు ప్రశంసనీయమని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షబ్బీర్ హుస్సేన్, షానాజ్ హుస్సేన్‌మాజిండ్రాణి పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలులో ఉన్న జీవో నంబరు 117ను రద్దుచేసి అందరికీ ఆమోదయోగ్యమైన విద్యా విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారని, అందుకు కృషిచేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తక్కువ సమయంలో బదిలీ ప్రక్రియను పూర్తిచేయడం అభినందనీయమన్నారు.

'ప్రకృతి'తో నాణ్యమైన పంటలు

అంబాజీపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. వక్కలంకలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శనివారం అధికారులు పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలో చేలగట్లను వెడల్పు చేసి గట్లపై వంగ, మిర్చి, టమాట, బెండ, చేమ, పసుపు సాగు చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయాధికారి ఎంవీవీ సత్యనారాయణ, నాగమణి పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



కాట్రేనికోన, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవుల వీధిలో మట్టపర్తి అనంతలక్ష్మి ఇంటి పెరట్లో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలాలు వికసించాయి. ఇవి ఏడాదికి ఒక సారి జూన్, జూలై నెలల్లో మాత్రమే సూర్యాస్తమయం తర్వాత వికసించి సూర్యోదయానికి ముడుచుకుపోతాయి.

శారీరక, మానసిక ఆరోగ్యానికి దివ్య ఔషధం యోగా



అమలాపురం రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధంగా పనిచేస్తుందని యోగా గురువు డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం కిమ్స్ డెంటల్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలు వేయించారు. శరీరంతో పాటు మనసును పునరుజ్జీవింప చేయడానికి యోగాసనాలు ఏవిధంగా దోహదపడతాయో సోదాహరణంగా వివరించారు. 3గంటలు యోగా సెషన్ నిర్వహించారు. డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. వీరిని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, జేఎండీ శేషవవిత్రలు అభినందించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం ట్రయల్ రన్

అంతర్వేది, జూన్14(ఆంధ్రజ్యోతి): ఈనెల21వ 11వఅంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగా ట్రయల్ రన్ శనివారం నిర్వహించారు. ఎంపీడీవో కె.సూర్యనారాయణ అధ్యక్షతన యోగా గురువు మన్నే సత్యనారాయణ యోగాసనాలు వేయించి ప్రాణాయామం, ధ్యానం చేయించారు. సచివాలయ ఉద్యోగులు, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ముమ్మిడివరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చునని టీడీపీ నాయకుడు గొలకోటి దొరబాబు పేర్కొన్నారు. చెయ్యేరు గున్నేపల్లిలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర ట్రయల్ రన్‌లో ఆయన మాట్లాడారు. యోగాభ్యాసనతో మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చునన్నారు. యోగా గురువులు వెంకటాచార్యులు, గనిశెట్టి వెంకటేశ్వరరావు అందరితో యోగాసనాలు వేయించి యోగాలో మెలకువలు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు యాళ్ల ఉదయ్, గొలకోటి తాతాజీ, గొలకోటి వెంకటరెడ్డి, గొలకోటి రాజబాబు, నకిలే వెంకటేశ్వరరావు, సబ్బితి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కె.ఇందుమతికృష్ణవేణి, వీఆర్వో ఎస్.శ్రీనివాస్, ఏపీఎంపీ రమణ, డ్వాక్రా యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర

ఉప్పలగుప్తం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పాటు ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు అన్నారు. గోపవరంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాపై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ కుంచే బుల్లియ్య, మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకటకృష్ణారావు, తెలుగురైతు మండలాధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, నీటిసంఘం చైర్మన్ ఆకుల వెంకటరమణ, కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ప్రధానకార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, కుంచే బాబులు, కార్యదర్శి డి.బాలబాలాజీ పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

మలికిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో 241మంది మృతిచెందడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలన్నారు. సమావేశంలో మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణుక్య, ఇందుకూరి అచ్యుతరామరాజు తదితరులు పాల్గొన్నారు.

భట్లపాలెంలో అచీవర్స్ డే వేడుకలు

బహుళజాతి కంపెనీలకు ఎంపికైన బీవీసీ విద్యార్థులు



ఉద్యోగం సాధించిన విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న విజయలక్ష్మి తదితరులు

అమలాపురం రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అచీవర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2025 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో 84శాతం మంది బహుళజాతి కంపెనీలైన ఇన్ఫోసిస్ కాగ్నిజెంట్, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్ వంటి సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి అడబాల కుమార్ తెలిపారు. అధికంగా రూ.9లక్షల ప్యాకేజీ కూడా ప్రకటించారన్నారు.కళాశాల అధినేత బోనం కనకయ్య మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్, బోనం విజయలక్ష్మి చేతులమీదుగా నూతనంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రిటికల్ రివర్ సంస్థ సీనియర్ డైరెక్టర్ జేపీ సాల్మన్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, రాజమహేంద్రవరం బీవీసీ ప్రిన్సిపాల్ టీవీ జనార్ధన్, ఏవో జక్కం వెంకటకృష్ణారావు, చలం, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

'కుటుంబంలో అందరికీ తల్లికి వందనం'

మలికిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఒక కుటుంబంలో ఎంతమంది ఉన్నా అంత మందికీ తల్లికి వందనం మంజూరు చేశామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎంతో మంది తనకు ఫోన్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఒక్కో కుటుంబంలో నలుగురికి, ముగ్గురికి కూడా తల్లికి వందనం డబ్బులు జమ అయ్యాయన్నారు. ప్రతిపక్షాలు పనికిమాలిన ప్రకటనలు చేస్తున్నాయని, ప్రభుత్వం సూపర్-6 పథకాలను అమలు చేస్తోందని, అతిత్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలవుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాజోలు నేతల పరామర్శ



విశాఖలో దివంగత మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాజోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పితృవియోగంతో బాధపడుతోన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాజోలు నియోజకవర్గ నాయకులు శనివారం పరామర్శించారు. విశాఖ నగరంలోని పల్ల స్వగృహానికి వెళ్లి ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్ల సింహాచలం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు, టీడీపీ వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది సత్తిరాజు స్వామి, బీజేపీ నాయకులు ఉపద్రష్ట నాగార్జున తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాజోలులో క్రీడాకారులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా


రాజోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 9,10,11వ తేదీల్లో జరిగిన 31వ ఇంటర్నల్ చాంపియన్ షిప్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు రాజోలు ప్రాంత క్రీడాకారులు ఎంపిక కావడంపై మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రాజోలులో వేమా స్వగృహం వద్ద జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వేమా సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన జి.దినేష్, ఆదిత్య, వెంకటేష్, వై.గంగాభవానీ, సిల్వర్‌మెడల్ సాధించిన వై.లక్ష్మీశశిరేఖ, బ్రాంచ్ మెడల్ సాధించిన కె.ధాత్రిజ, హేమసత్యశ్రీ, భవనేష్‌లను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను ఆయన అభినందించారు. ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లతేంద్రవర్మ, కరాటే మాస్టారు కె.విజయనారాయణ, తైక్వాండో కోచ్‌లు ఆర్.మణికుమార్, కరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు మృతి



ఉప్పలగుప్తం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గోపవరం ఉన్నత పాఠశాల సీఎంసీ చైర్మన్ ములపర్తి శ్రీనివాసరావు(43) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. నీటిసంఘం చైర్మన్ ఆకుల వెంకటరమణ, సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ కొంకి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకటకృష్ణారావు, తెలుగురైతు అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, హెచ్‌ఎం ముషిణి వరలక్ష్మి, గెడ్డం సత్తిబాబు, జితేంద్ర తదితరులు కుటుంబ సభ్యులను కలిసి విచారం వ్యక్తం చేశారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం



అమలాపురం బ్లడ్ బ్యాంకులో 61వ సారి రక్తదానం చేస్తున్న గోటేటి గంగాధర్

అమలాపురం టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక యెండూరి బ్లడ్ బ్యాంకులో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు రక్తదానం చేశారు. వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడైన గోటేటి గంగాధర్ 61వసారి రక్తదానం చేశారు. వలవల శివరావు 40వసారి, యర్రమిల్లిస త్యనారాయణమూర్తి 25వ సారి నమ్మిన వీరబాబు 16వసారి రక్తదానం చేయగా పుత్సా కృష్ణకామేశ్వర్ తొలిసారి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన దాతలకు అమలాపురం గోల్డ్ మార్కెట్ భవనంలో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పసుమర్తి గోపాలకృష్ణ, చింతలపూడి సత్తిబాబు, యెండూరి నాగేశ్వరరావు, పట్నాల రమణ, నూకల సత్యనారాయణ, పేరి లక్ష్మీనరసింహం, వలవల నాయుడు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుడుపూడి త్రినాథ్, కూచిమంచి కృష్ణ, కాశిన వీరభద్రరావు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ

కాట్రేనికోన,జూన్14(ఆంధ్రజ్యోతి): పెనుమెల్ల పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం మండల గ్రామపంచాయతీ కార్మికుల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ముదుదుడ్డి అన్నవరం, ఉపాధ్యక్షుడిగా కోరుమిల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా దాసరి లోవరాజు, ట్రెజరర్‌గా దొమ్మేటి వెంకటరామగోపాలం, సభ్యులుగా అనిశెట్టి సత్యనారాయణమూర్తి, పిల్లి శ్రీనివాసవిద్యాసాగర్, సాధనాల పరమేశ్వరరావు, కొప్పిశెట్టి అప్పారావును ఎన్నుకున్నారు.

22న కవి సమ్మేళనం

అంతర్వేది, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జూన్ 22వ తేదీ ఆదివారం కాకినాడలో గోదావరి కవితా పండుగ పేరుతో జాతీయ స్థాయిలో ద్విశత కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు.

కేశవస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం

ఆత్రేయపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన పి.శ్రవణ్ కుమార్, జయలక్ష్మి దంపతులు రూ.25,166, ర్యాలికి చెందిన తాడి నూకయ్య, నాగలక్ష్మి దంపతులు రూ.10,200, విశాఖకు చెందిన ఎం. యశ్వంత్ రూ.5,116, మోపిదేవి కృష్ణ మోహన్ రూ.5,116, నూజివీడుకు చెందిన లావు ఆనందధనకోటి ప్రసాదరావు రూ.5,116 విరాళాలను సమర్పించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి దాతలకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.



ర్యాలి కేశవస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దృశ్యం



మందపల్లి శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతున్న భక్తులు

శనేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వ దర్శనాలు, తైలాభిషేకాలకు భక్తజనం బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,05,111 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కల్వర్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం-ద్వారపూడి మధ్య రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టుల పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రహదారులు, భవనాలశాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తాపేశ్వరం, ద్వారపూడి మధ్య జరుగుతున్న కల్వర్టుల పనులను పరిశీలించారు. పంట కాల్వలకు నీరు విడుదల చేయకముందే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. జరుగుతున్న పనుల తీరును అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట డీఈఈ సూర్యనారాయణ, పాలచర్ల శిరీష, శెట్టి రవి, చోడిశెట్టి పద్దకాపు తదితరులు వున్నారు.



తాపేశ్వరం-ద్వారపూడి మధ్య జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

భీమేశ్వరాలయంలో రైల్వే మేజిస్ట్రేట్ పూజలు

ద్రాక్షారామ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం విజయవాడ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ఆర్‌వీ శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం నంది మండపంలో వారికి ఆశీర్వచనం అందచేశారు.

భీమేశ్వరుని అన్నదాన ట్రస్టుకు విరాళం: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీపాద లక్ష్మీ నరసింహమూర్తి శనివారం రూ.51,116 విరాళం ఇచ్చారు. దివంగత శ్రీపాద కామశాస్త్రి, సూర్యాకాంతం పేరుతో వారు విరాళం అందచేశారు. కార్యక్రమంలో చండీ హోమందారులు జుత్తుక చిన్న, పారాయణదారులు మేడవరపు శ్రీరామ్‌శర్మ పాల్గొన్నారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం భరోసా

రావులపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు కార్పొరేట్ వైద్యం చేయించుకునే వీలు కల్పించేందుకు సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అనారోగ్య సమస్యలతో వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రావులపాలెం క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో నియోజకవర్గ పరిధిలో మంజూరైన రూ.26,51,699 చెక్కులను ఎమ్మెల్యే బండారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ఆలమూరు వినాయక ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఘనంగా సంకటహర చతుర్థి

ఆలమూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థి సందర్భంగా శనివారం మండలంలోని ఆయా గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, జొన్నాడ తదితర గ్రామాల్లో సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా వినాయకుడి ఆలయాల్లో సంకటహర చతుర్థి పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాయవరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వినాయకుడి ఆలయంలో వినాయకుడికి అభిషేకాలు, అర్చనలు, గరికపూజ, హారతులు నిర్వహించారు. రాయవరం రాజేశ్వరకాలనీలో ఉన్న వినాయకుడికి సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మహిళలు పూజలు, భజనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు.

పంట కాలువల్లో చెత్త వేస్తే చర్యలు

సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి



ఆలమూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పంటభూములకు సాగునీరు అందించే పంట కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తప్పదని చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంట కాలువగట్లపై ఆక్రమణలు జరిపితే స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. లేనిపక్షంలో వాటిని నీటిపారుదల శాఖ అధ్వర్యంలో తొలగిస్తామన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టి లో పెట్టుకుని ప్రజలు సహకరించాలన్నారు.

16న జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 16న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రముఖ కంపెనీలు నియామకాలు జరుపుతాయని వివరాలకు ఉపాధి కార్యాలయం డైరెక్టర్ రామ్‌కుమార్‌ను 95154 81671 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.



ఆలమూరు మండలం సూర్యారావుపేట కాలువ వంతెన శిథిలావస్థకు చేరిన దృశ్యం. పక్క చిత్రంలో వంతెనపై నుంచి భారీ వాహనాల రాకపోకలు జరగకుండా అడ్డుగా వేసిన స్తంభం

వంతెన శిథిలావస్థకు చేరినా పట్టించుకోరా?

• సూర్యారావుపేట వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించిన వైనం
• ప్రమాదం పొంచి ఉందన్న అధికారులు, వాహనదారులు

ఆలమూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం సూర్యారావుపేట వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా భారీ వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆలమూరు మండలం నుంచి కపిలేశ్వరపురం మండలానికి వెళ్లే భారీ వాహనాలకు బ్రేక్ పడింది. రాకపోకలు నిలిచిపోవడంతో సూర్యారావుపేట, జిల్లెళ్లపేట, కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామాల మీదుగా వెళ్లే వీలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కపిలేశ్వరపురం మండలం నుంచి ఆలమూరు మండలం వైపు వచ్చే వాహనాలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

1983-84లో వంతెన నిర్మాణం: సూర్యారావుపేట వంతెన లేని రోజుల్లో పెద్ద కాలువ దాటడానికి దోనిపై రాకపోకలు సాగించేవారు. వాహనాలు లేకపోవడంతో నడకదారినే వెళ్లాల్సి వచ్చేది. 1983-84లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో వంతెన నిర్మాణం చేపట్టారు. అప్పట్లో గ్రామస్తులు అనేక మంది శ్రమదానం కూడా చేశారు. దీంతో సూర్యారావుపేట గ్రామంతో పాటు కపిలేశ్వరపురం మండలానికి రాకపోకలు ఏర్పడాయి. అప్పట్లో మండపేట నుంచి కపిలేశ్వరపురానికి సిటీ సర్వీసు కూడా నడపడంతో ఆయా గ్రామాలకు వరంగా మారింది. ప్రస్తుతం ఈ వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే పరిస్థితిపై సూర్యారావుపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మరింత శిథిలస్థితికి చేరడంతో వీటిపై భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు.

ఓఎన్జీసీ వాహనాలతో నష్టం: రెండు దశాబ్దాలుగా ఓఎన్జీసీకి చెందిన భారీ వాహనాల రాకపోకలతో వంతెన మరింత దెబ్బతిన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతులు, గ్రామస్తుల వాహనాల రాకపోకల వల్ల ఈ వంతెనకు నష్టం జరగలేదని వారంటున్నారు.

దీని నిర్మాణానికి రూ.4 కోట్లతో అంచనా: ఈ వంతెన నిర్మాణానికి రూ.4కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్టు రామచంద్రపురం ఆర్‌అండ్‌బి డీఈ సూర్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం మరమ్మతులు చేయడానికి రూ.40 లక్షల ఖర్చు అవుతుందని ఈ రెండు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేస్తే వీటి పనులు ప్రారంభిస్తామన్నారు. అప్పటి వరకు భారీ వాహనాలను నిలిపివేసినట్టు ఆయన చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు. పక్క చిత్రంలో దర్శనానికి బారులుతీరిన భక్తజనం

భక్తవత్సల గోవింద..

• వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
• స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.67.43 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదంలో పాల్గొన్నారు. రాత్రి జరిగిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.67.43 లక్షలు వచ్చినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



కేశవరంలో హైస్కూల్ ప్రహరీ కోసం రిలే నిరాహారదీక్ష చేస్తున్న శ్రీవాణి

కేశవరం హైస్కూల్ ప్రహరీ కోసం 58 రోజులుగా శ్రీవాణి రిలే నిరాహారదీక్ష

మండపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కేశవరంలో వున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాలంటూ గ్రామానికి చెందిన వల్లూరి శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహారదీక్ష శనివారం 58వ రోజుకు చేరింది. విద్యార్థుల భవిష్యత్ కోసం తాను చేస్తున్న దీక్షకు ప్రభుత్వ పెద్దలు సహకరించకపోవటంపై ఆమె అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రహరీ నిర్మించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మహిళా సాధికారిత అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆత్రేయపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి సాధికారిత దిశగా అడుగులు వేయాలని వేజ్ సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం పేర్కొన్నారు. శనివారం ఆత్రేయపురం మండల సమాఖ్య కార్యాలయంలో పంచాయతీరాజ్ వ్యవస్థ జెండర్ ఈక్విటీపై వేజ్ సంస్థ అవగాహన సంస్థ నిర్వహించారు. ఆత్రేయపురం ర్యాలి, ఊబలంకలో పనిచేసే ఎస్‌హెచ్‌జీ గ్రూప్ లీడర్లకు, యానిమేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ అంబేద్కర్, పారా కోఆర్డినేటర్ రమేష్, ఏపీ కోఆర్డినేటర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేటలో జరిగిన యోగాంధ్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ కమిషనర్ తదితరులు

మండపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆలమూరు రోడ్డులో వున్న కన్వెన్షన్ హాలులో శనివారం యోగాంధ్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. యోగా గురువులు సత్యసాయి ధ్యాన మండలికి చెందిన రఘు, తిరుపతి రాజులు యోగాపై తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ట్రయిల్ రన్

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమం సోమవారం ఉదయం 6 గంటలకు వాడపల్లిలోని శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్ద ప్యామిలి యోగా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొననున్నారు. ఇందులో భాగంగా శనివారం యోగాంధ్ర ట్రయిల్ రన్ నిర్వహించారు. బొబ్బర్లంకలో సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఎంవీ రామారావు, ఎంపీడీవో వెంకటరామన్, సచివాలయ ఉద్యోగులు ట్రయల్ రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం యోగాంధ్ర ట్రయల్ రన్ నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ యోగాను చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు, మానసికోల్లాసం కలుగుతుందని వివరిస్తూ ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో యోగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారితో యోగాసనాలు చేయించారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ కార్యాలయం, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం ప్రజలతో యోగాంధ్ర ట్రయిల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ జి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఆర్ఎంవీఎస్ ఈశ్వరరావు, మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యోగా, ధ్యానం వల్ల మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం కలుగుతుందన్నారు.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలంలో శనివారం ఆయా గ్రామాల్లో యోగాంధ్ర నిర్వహించారు. మండలంలో హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో 6 వేదికల వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కాశి రాకేష్, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, డ్వాక్రా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. యనమదల గ్రామంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు విత్తనాల వెంకట రమణ, గ్రామస్థులు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి పూజలు

కపిలేశ్వరపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో శనివారం కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దంపతులు గ్రామంలోని వేద పండితులు తంగిరాల దత్తాత్రేయశర్మ స్వగృహానికి వచ్చారు. శ్రీనివాసవర్మ పెళ్లిరోజు సందర్భంగా వారికి దత్తాత్రేయశర్మ స్వగృహంలో పూజలు, హోమాలు జరిపారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఆయనకు సర్పంచ్ సాకా శ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, మద్దుల సుబ్బారావు, తోరం రాము తదితరులు ఆయన్ను సన్మానించారు.

ఇంజనీరింగ్ కార్మికులకు పీడీఎస్‌యూ మద్దతు



కార్మికులకు మద్దతు తెలుపుతున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ 27 రోజులుగా సమ్మె చేస్తున్న ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్‌కు శనివారం పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, నాయకులు కె.సురేష్ తదితరులు మద్దతు ప్రకటించి ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల మంది మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు 27 రోజులుగా సమ్మె చేస్తున్నారని నేటికీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు జీఎస్ శ్రీనివాసరావు, వి.శ్రీనివాస్, జి.ప్రసాద్, బి.రాజు, ఎం.బాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరంలో పాల్గొనండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 14(ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రపురం బులుసు కల్యాణమండపంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మంత్రి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వారికి లక్ష రూపాయల ఇన్సూరెన్సు సౌకర్యం కల్పిస్తారన్నారు. శిబిరంలో 40 మంది ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహార కిట్స్ అందచేస్తారని, తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారుల చదువు నిమిత్తం దత్తత కార్యక్రమం ఉంటుందని మంత్రి తెలిపారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఆత్రేయపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వర్‌రామకృష్ణన్ లయిన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య నిపుణులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం పలువురికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. మరికొంత మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఆసుపత్రికి తరలించారు. ముళ్ళపూడి మోహనరావు శిబిరాన్ని పర్యవేక్షించి సేవలను అందించారు.



పేరవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం